క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

కోనరావుపేట: ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేస్తే ఇంజినీరింగ్‌లో ఉచిత అడ్మిషన్ పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, అధ్యాపకులు సుధాకర్, శ్రీనివాస్, ప్రసాద్, రమేశ్ ఉన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన



రంగంపేటలో పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

వీర్నపల్లి: మండలంలోని రంగంపేటలో క్షయవ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి అనిత, వైద్యురాలు స్నేహ మాట్లాడుతూ షుగర్, క్యాన్సర్, బీపీ, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు క్షయవ్యాధికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. 124 మందికిపైగా స్క్రీనింగ్ చేసి.. 22 మంది నుంచి తెమడ నమూనాలు సేకరించినట్లు తెలిపారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన ఆరుగురికి ఆరు నెలలపాటు ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామని తెలిపారు. టీబీ ప్రోగ్రాం సూపర్‌వైజర్ మహిపాల్, రమేశ్, స్నేహ, ఏఎన్‌ఎం సుజాత, కీర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



తంగళ్లపల్లి: మండెపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి: మండెపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామంలోని 377 సర్వే నంబర్‌లో 360 ఎకరాల భూమి ఉండగా గత ప్రభుత్వం అవసర నిమిత్తం వాడుకుందని మిగిలిన భూమి కబ్జా కాకుండా చూడాలని గ్రామస్తులు తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లి, ఇల్లంతకుంట, గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తాళ్లపల్లిలో 33 దరఖాస్తులు స్వీకరించామని తహసీల్దార్ తెలిపారు. ఇల్లంతకుంట రెవెన్యూ సదస్సులో 32 దరఖాస్తులు స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, ఆర్‌ఐలు సంతోష్, శశి, వీఆర్వో సింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని గూడెం, మొర్రాపూర్‌లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో పెద్దసంఖ్యలో రైతులు దరఖాస్తులు అందించారు. గూడెంలోనే 185కుపైగా దరఖా స్తులు వచ్చాయి. తహసీల్దార్ సురేశ్, నాయబ్ తహసీల్దార్ అపర్ణ,సిబ్బందిపాల్గొన్నారు.

శివాజీకి నివాళి



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని జయవరంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యమివ్వాలి



సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా తమ సామాజిక వర్గానికి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వచ్చిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని, స్థానిక సంస్థల్లో ఎంపీటీసీలు సర్పంచులు, చైర్మన్ల పదవుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు పంబాల దేవరాజ్. సంయుక్త కార్యదర్శి, జంగాపల్లి శేఖర్, రాయిని ప్రతాప్, సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు వంకాయల కార్తీక్, నరేశ్, మామిండ్ల నారాయణ, కాంగ్రెస్ నాయకుల పాల్గొన్నారు.

అద్దె భవనంలో అవస్థలు

- వేములవాడలో బోయినపల్లి గురుకులం
- ఆరేళ్లుగా అద్దె భవనంలోనే..
- నెలకు రూ.2లక్షలు చెల్లింపు
- బోయినపల్లిలో సిద్ధంగా ఐదెకరాలు
- పక్కా భవన నిర్మాణానికి నిధులు కరువు



వేములవాడలోని బోయినపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం

బోయినపల్లి: ఆరేళ్లుగా అద్దెభవనం.. అరకొర వసతులు.. అయినా అక్కడే నిర్వహణ. బోయినపల్లికి మంజూరైన గురుకులం విద్యాలయం వేములవాడలో అద్దె భవనంలో కొనసాగుతోంది. నెలకు రూ.2లక్షలు అద్దె చెల్లిస్తున్నారు. బోయినపల్లిలో అద్దె భవనం దొరకడం లేదని అక్కడే కొనసాగిస్తున్నారు. ఈ యేడాది గంగాధరకు తరలిస్తారనే ప్రచారం ఉంది.

ఐదెకరాలు.. నిధులు కరువు

బోయినపల్లి మండల కేంద్రంలో గురుకుల భవన నిర్మాణానికి ఐదు ఎకరాల మేర స్థలం కేటాయించారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో భవనం కలగానే మిగిలింది. ఈనెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండడంతో ఈసారైనా బోయినపల్లికి గురుకులం తరలివస్తుందనే ఆశలో విద్యార్థులు ఉన్నారు. అయితే ఏ యేడాది గంగాధరకు తరలిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికే అధికారులు ఓ భవనాన్ని సైతం పరిశీలించినట్లు తెలిసింది.

నెలకు రూ.2లక్షల అద్దె

వేములవాడ అద్దె భవనంలోని బోయినపల్లి గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. వేములవాడలోని అద్దె భవనానికి ప్రతీ నెల రూ.2లక్షలు అద్దె చెల్లిస్తున్నా కనీసం మైదానం కూడా లేదు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీలలో రెండు సెక్షన్లు ఉన్నాయి. 480 మంది స్కూల్ విద్యార్థులు, 160 మంది ఇంటర్ విద్యార్థులు చదువుతున్నారు. మొదట చొప్పదండిలో గురుకుల పాఠశాల నిర్వహించగా.. విమర్శలు రావడంతో బోయినపల్లి మండలం విలాసాగర్ సాంఘిక సంక్షేమ వసతి గృహానికి తరలించారు. అక్కడ రూ.30లక్షలతో అదనపు తరగతి గదులు, టాయిలెట్లు నిర్మించారు. కొద్ది నెలల తర్వాత విద్యార్థుల సంఖ్య పెరిగిందని వేములవాడలోని అద్దె భవనంలోకి తరలించారు.

అద్దె భవనం దొరకడం లేదు



బోయినపల్లిలో గురుకుల పాఠశాల నిర్వహణకు సరైన భవనం దొరకడం లేదు. 50 గదులతో కూడిన భవనం కావాలి. ఇంత పెద్ద భవనం స్థానికంగా దొరక్కపోవడంతో వేములవాడలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. బోయినపల్లిలో అద్దె భవనం దొరికితే అక్కడికి తరలించడానికి ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రంగిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి: నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన అధికారులు, నాయకులతో కలిసి మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. నియోజకవర్గానికి ప్రభుత్వం మంజూరు చేసే 35 వందల ఇందిరమ్మ ఇళ్లతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరో 1750 ఇళ్లు మంజూరు చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. రైతువేదికలో పలువురికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నట్రాజ్, రుద్రంగి ఎస్సై మోతీరాం నాయక్, ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏటా బదిలీలు పదోన్నతులు చేపట్టాలి

వేములవాడ: ఏటా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ అన్నారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ నివాసంలో ఉపాధ్యాయులతో కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలో పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్ వేతనాలు ఇంకా పూర్తిస్థాయిలో అందలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు దుమాల రామనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వికుర్తి అంజయ్య, పంజాల వెంకటేశ్వర్లు, పురం వాసుదేవరావు, దబిడ హనుమాన్, మందాడి శ్రీనివాస్‌రెడ్డి, నూగురి దేవేందర్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. కరీంనగర్‌లోని దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ఎస్టిమేట్ పత్రాలు అందజేసిన అనంతరం వేములవాడలో విప్‌ను కలిసి ఈమేరకు విన్నవించారు. నాయకులు నంది కిషన్, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, సనుగుల ఈశ్వర్ ఉన్నారు

సమస్యలు పరిష్కరించాలి

మండలంలో పలు సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనుల కోసం నిధులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కాంగ్రెస్ నాయకులు కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

'ఆది'కి మంత్రి పదవి ఇవ్వాలి

సిరిసిల్లటౌన్: రాష్ట్ర మంత్రివర్గంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు చోటు కల్పించాలని జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బొప్ప దేవయ్య కోరారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి వస్తే జిల్లా అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి పొంచెట్టి శంకర్, దుమాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ



గూడెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: పేదల సొంతింటి కలను నేరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోహినికుంట, చీకోడు, గూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఎంపీడీవో బీరయ్య, మాజీ జెడ్పీటీసీ యాదగిరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నిరుపేదల సొంతింటి కల నేరవేరుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

ఇల్లంతకుంట: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో శశికళ అన్నారు. రేపాకలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేయగా పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు టోని, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆనందం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయంపై దాడి అమానుషం

ఇల్లంతకుంట: ఏపీలోని సాక్షి కార్యాలయంపై దాడులు చేయడం, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం సిగ్గుచేటని జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మంద అనిల్ కుమార్ సోమవారం ఆరోపించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులపై, పత్రికావిలేకరులపై, అక్రమ దాడులు అరెస్టులు, చేస్తున్నారన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



సిరిసిల్లటౌన్: పెద్దూరులో బడిబాటలో పాల్గొన్న ఎంఈవో రఘుపతి, గ్రామస్తులు

సిరిసిల్లటౌన్: సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య అందుతుందని సిరిసిల్ల ఎంఈవో దూస రఘుపతి అన్నారు. సోమవారం ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో బడిబాట భాగంగా గ్రామసభ నిర్వహించారు. పెద్దూరు పాఠశాలలో సకల వసతులతో కూడిన తరగతి గదులు, ఇంగ్లిష్ మీడియంలో డిజిటల్ విద్యాబోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందుతుందన్నారు. అనంతరం వార్డులో అవగాహన ర్యాలీనిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఏపీసీ చైర్‌పర్సన్ తిప్పవరం సుధా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో కృష్ణహరి అన్నారు. అల్మాస్‌పూర్, రాచర్ల బొప్పాపూర్, కిషన్‌దాస్‌పేటలో ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీలు, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

డప్పుచప్పుళ్లతో బడిబాట

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ హరిజనవాడ పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం డప్పుచప్పుళ్ల మధ్య బడిబాట నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి, వెంకట్రావుపల్లిల్లో బడి బాటలో భాగంగా ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాద రాములు, తిరుపతి , ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● **రేపు ఉచిత వైద్య శిబిరం**

సిరిసిల్లకల్చరల్: జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు కొనసాగే శిబిరంలో మెడికవర్ వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

● **నిధులు మంజూరు చేయాలని వినతి**

బోయినపల్లి: రజక సంఘం భవన అభివృద్ధి.. మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో బోయినపల్లి గ్రామ రజకసంఘం నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం అందించారు. రజక సంఘం అధ్యక్షుడు గంగిపెల్లి మొండయ్య, మల్లేశం, గంగిపెల్లి రాజశేఖర్, గంగిపెల్లి శ్రీనివాస్, అనిల్, దుడ్డెల లచ్చయ్య, రాజయ్య, గంగిపెల్లి సుధాకర్, రాజు, మల్లేశం, రమేశ్ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● **మైనారిటీ విద్యా సంస్థల్లో చేరండి**

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో సిరిసిల్ల, వేములవాడలోని మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేందుకు ముందుకు రావాలని జిల్లా మైనార్టీ అభివృద్ధి అధికారి ఎంఏ భారతి కోరారు. మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతి కోసం రూపొందించిన వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● **గుండెపోటుతో మృతి**

వేములవాడ: వేములవాడ ప్రాంత తెలంగాణ ఉద్యమకారుడు పొలాస రాజేశం (50) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో పనులు ముగించుకుని పట్టణంలోని లాలపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. రాత్రి గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కొడుకులు వెంకటేశ్, రాజేందర్ ఉన్నారు. రాజేశం మృతిపట్ల విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ మాజీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, బీజేపీ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

● **వసతి గృహం పరిశీలన**

వేములవాడఅర్బన్: స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని మహాత్మా జ్యోతిబాపూలే జాయింట్ సెక్రటరీ శ్యాంప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. నీటి సంపు, వంట గది, విద్యార్థుల యూనిఫామ్‌లను పరిశీలించారు. విద్యార్థులు వచ్చే సమయానికి అన్ని గదులను శుభ్రం చేసి సిద్ధంగా ఉంచాలన్నారు.

● **నూతన కార్యవర్గం**

గంభీరావుపేట: మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా దోమకొండ కృష్ణకాంత్ యాదవ్(ముస్తఫానగర్) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బొంగు మల్లేశం యాదవ్ (నర్మాల), కోశాధికారిగా గొడుగు దేవయ్య(కొత్తపల్లి), ఉపాధ్యక్షులుగా ఎక్కలదేవి చంద్రం, చెరుకూరి అనిల్, అగ్గతి పోచయ్య, చేకూటి మహేశ్, సంయుక్త కార్యదర్శులుగా మెండె శ్రీనివాస్, సలహాదారులుగా కావేటి బాలమల్లు, ఘనపురం భిక్షపతి, కార్యవర్గ సభ్యులుగా పెంబర్తి వెంకటి, నాయిని రమేశ్ ఎన్నికయ్యారు. యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్‌యాదవ్ ఆదేశానుసారం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

● **బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వాలి**

కోనరావుపేట: అర్హులైన బీడీ కార్మికులందరికీ ఫించనివ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. బీడీ కార్మికులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం ఇచ్చారు. జ్యోతి, గంగాభవానీ, విజయ, లక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

● **పంటల సాగుపై అవగాహన**

గంభీరావుపేట: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం, బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల, శాస్త్రవేత్తలు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎరువుల వాడకం, యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి సలావుద్దీన్, శాస్త్రవేత్తలు అరుణ్ బాబు, ప్రియదర్శిని, అధికారులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: రాళ్లపేటలో రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు నిర్వహించారు. అధిక దిగుబడి కోసం చేపట్టాల్సిన అధునాతన సాంకేతిక విధానాలను వివరించారు. వ్యవసాయ అధికారి సంజీవ్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



గంభీరావుపేట : మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో గాంధీ చౌక్ ఏరియాలో ఉన్న వ్యాపార దుకాణాల సముదాయాల నేమింగ్ బోర్డుల పై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అటు వ్యాపార కాంప్లెక్స్, ఇటు మాంసం దుకాణాల సముదాయాల నేమింగ్ బోర్డులు మచ్చుకకు కూడా కానరావడం లేదు. ఎప్పుడో రాసిన పేర్లు కాలక్రమేణ కనుమరుగయ్యాయి. కొత్త గా రాయించాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
లక్ష్మణ్, పంచాయతీ ఈవో, గంభీరావుపేట, 98495 97070

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

చినుకు కురిసింది.. పుడమి మురిసింది

- జిల్లా అంతటా వర్షాలు.. వ్యవసాయ పనుల్లో కర్షకులు
- రుద్రంగిలో అత్యధికంగా 28.2 మిల్లి మీటర్ల వర్షం



కోనరావుపేట మండలం కనగర్తి శివారులో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు

సిరిసిల్ల: నిన్నమొన్నటి వరకు భగభగమండిన సూరీడు మృగశిర కార్తె ప్రవేశంతో చల్లబడ్డాడు. కార్తె ప్రవేశించిన ఆదివారం నాడే చిరుజల్లులు పడడంతో రైతులు వ్యవసాయపనుల్లో మునిగిపోయారు. దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. ఎరువులు జారకొడుతూ.. పత్తి విత్తుకునేందుకు అచ్చు కొడుతున్నారు. జిల్లాలో ఈ వానాకాలంలో 2,43,773 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వరి 1,84,860 ఎకరాల్లో సాగవుతుండగా.. పత్తి 49,760 ఎకరాలు, ఇతర పంటలు 9,153 ఎకరాల్లో సాగుకానున్నాయి. ఇందులో కందులు 1,155 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో కురిసిన వర్షపాతం ఇలా..

జిల్లాలో సోమవారం అత్యధికంగా రుద్రంగిలో 28.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చందుర్తిలో 20.4, వేములవాడ రూరల్‌లో 12.4, బోయినపల్లిలో 4.1, వేములవాడలో 3.8, సిరిసిల్లలో 7.9, కోనరావుపేటలో 9.6, వీర్నపల్లిలో 14.5, ఎల్లారెడ్డిపేటలో 10.5, గంభీరావుపేటలో 17.6, ముస్తాబాద్‌లో 12.0, తంగళ్లపల్లిలో 5.4, ఇల్లంతకుంటలో 4.6 మిల్లీమీటర్ల వర్షం పడింది.

కలెక్టరేట్ ఎదుట నిరసనల హోరు

సిరిసిల్లటౌన్: జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం నిరసనలతో హోరెత్తింది. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని నినాదాలు హోరెత్తాయి. సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్ ముందు వరుస ధర్నాలు..నిరసన కార్యక్రమాలతో దద్దరల్లింది. సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

జిల్లా కేంద్రం పరిధిలోని చిన్న బోనాల, ముష్టిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని అమ్మ ఆదర్శ పాఠశాలల సిబ్బంది కోరారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరుతూ..మాజీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన చేపట్టి మాట్లాడారు. చిన్న బోనాల పాఠశాలలో 65 మంది విద్యార్థులకు కేవలం 4 మంది ఉపాధ్యాయులు ఉన్నారని వారిలో ఇద్దరు డిప్యూటేషన్‌పై, ఒకరు రిటైర్డ్ అయ్యారన్నారు. ముష్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. అదనపు టీచర్లను నియమించాలని కోరుతూ..ఎంఈవో, డీఈవో, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. బండారి భాగ్యవ్వ, గుగ్గిల లావణ్య, లలిత, బి.వినోద్, నరాల లత, సరోజ, అనన్య, లింబవ్వ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు చెల్లించాలి



ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని మిడ్ డే మీల్స్ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ జీతాలు, విద్యార్థుల మెస్ చార్జీలు, చెల్లించాలని కోరుతూ..చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 11 ఏళ్లు గడుస్తున్నా కార్మిక చట్టాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని, సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఐడెంటీ కార్డులు ఇవ్వాలని, పీఎఫ్ ఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. లేకపోతే జూలై నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెకు వెళ్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, బీరెడ్డి లక్ష్మి, విజయ, లత, మమత, కమలవ్వ, పోచవ్వ, కొమరవ్వ, తదితరులు పాల్గొన్నారు.

కులగణన డబ్బులు ఇప్పించాలి

ప్రభుత్వం చేపట్టిన కులగణన సంబంధించిన కార్యక్రమ డబ్బులను వెంటనే తమకు ఇప్పించాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లు కోరారు. కలెక్టరేట్‌కు తరలొచ్చి నిరసన చేపట్టి మాట్లాడారు. ఆరునెలల క్రితం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన వివరాలను తాము ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ఇప్పటివరకు ఆరునెలలు గడిచినా తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని కోరుతూ..కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోయినపల్లి: మండలంలోని కొదురుపాకలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్‌ఐ మనోజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆర్‌ఐ మనోజ్, రెవెన్యూ సిబ్బంది కొదురుపాక పరిసరాల్లో వెళ్తుండగా మాన్వాడ మానేరు వాగునుంచి లాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్‌ఐ పేర్కొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

ఇల్లంతకుంట: మండల అధ్వానంగా ఉన్న రోడ్లు, ఇసుక అక్రమ రవాణాపై ఎస్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ఈసీ మెంబర్ అన్నాడు సత్యనారాయణ రెడ్డి సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఫిర్యాదు చేశారు. అటవీ భూముల ఆక్రమణ, భూముల సర్వే నంబర్ల గురించి కలెక్టర్‌కు వివరించారు.